యూరియా.. రైతన్న యాతన

జిల్లాలో యూరియా కొరతతో రైతులు నరకయాతన పడుతున్నారు. పనులన్నీ వదులకుని గంటల తరబడి ఆగ్రోస్, ఫర్టిలైజర్స్, పీఏసీఎస్ సెంటర్ల వద్ద నిరీక్షిస్తూ నీరసించిపోతున్నారు. సోమవారం అన్ని మండలాల్లో యూరియా కోసం రైతులు బారులు తీరారు. పోలీస్ బందోబస్తుతో ఒక్కో రైతుకు ఒక్కో బస్తా మాత్రమే అందించడంతో సగానికిపైగా రైతులకు యూరియా దొరకడంలేదు. పలుచోట్ల రైతులు యూరియా పంపిణీపై అసహనం వ్యక్తం చేశారు. అదునుకు యూరియా లేక పడరాని పాట్లు పడాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. నర్మెటలో ఎమ్మార్పీ రూ.266.50లకు అమ్మాల్సిన యూరియా బస్తాను ఓడీసీఎంఎస్ నిర్వాహకులు రూ.300లకు అమ్ముతూ రూ.266లకే బిల్లు ఇస్తుండటంతో అధిక ధర వసూలు చేస్తున్నారని రైతులు నిర్వాహకుడితో వాగ్వాదానికి దిగారు. యూరియా కొరతపై బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసనలు తెలియజేశారు.

– సాక్షి, నెట్‌వర్క్


జనగామ: జిల్లా కేంద్రంలో యూరియా బస్తా కోసం రైతుల బారులు


రఘునాథపల్లి: రైతు వేదిక వద్ద యూరియా కోసం ఆందోళన చేస్తున్న రైతులు


పాలకుర్తి టౌన్: సొసైటీ గోదాం వద్దవర్షంలో యూరియా కోసం క్యూలో నిల్చున్న రైతులు


తరిగొప్పుల: ఆగ్రోస్ వద్ద పడిగాపులు కాస్తున్న రైతులు


జఫర్‌గఢ్: సొసైటీ కార్యాలయం వద్ద..


కొడకండ్ల: సొసైటీ గోదాం వద్ద బారులుదీరిన రైతులు

క్లుప్తంగా

ఉపాధ్యాయుల నిరసన

కొడకండ్ల: సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఏడునూతుల ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేశారు. సీపీఎస్‌తో ఉద్యోగ, ఉపాధ్యాయుల భవిష్యత్ చీకటిగా మారుతుందని, సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. హెచ్‌ఎం యాకయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వరద బాధితులకు సాయం

నర్మెట: ఇటీవల కురిసిన భారీ వర్షాలతో నష్టపోయిన కామారెడ్డి జిల్లా కేంద్రంలోని జీజీఆర్ నగర్ దళితవాడ బాధితులకు మండల కేంద్రానికి చెందిన రైసింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం నిరుపేద కుటుంబాలకు ప్రత్యక్షంగా నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ పిడుగు మమత సాయిబాబ, స్థానిక నాయకులు బంగారి లక్ష్మణ్, గౌస్, కరీం, కృష్ణ, అఫన్, నిర్మల, సుదామలేఖ్య, ఫౌండేషన్ చైర్మన్ ఎనుగుల వెలంగిణి , సభ్యులు గద్దల కిషోర్, కుమార్, పులి ప్రవీణ్, గద్దం మల్లేష్, కుంటి ఆంజనేయులు పాల్గొన్నారు.

ఇద్దరికి గాయాలు

స్టేషన్‌ఘన్‌పూర్: ముందు వెళ్తున్న స్కూటీని వెనుక నుంచి కారు ఢీకొట్టిన ప్రమాదంలో గుండె సుధాకర్, ఏడెల్లి అశోక్ అనే ఇద్దరు గాయపడ్డ సంఘటన మీదికొండ క్రాస్ రోడ్డు వద్ద జాతీయ రహదారిపై సోమవారం సాయంత్రం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. రఘునాథపల్లి మండలం కంచనపల్లికి చెందిన గుండె సుధాకర్, ఘన్‌పూర్ మండలం రాఘవాపూర్‌కు చెందిన అశోక్ తాపీమేస్త్రీలుగా పనిచేస్తున్నారు. కాగా, సోమవారం సాయంత్రం స్కూటీపై ఇద్దరు స్టేషన్‌ఘన్‌పూర్ నుంచి రాఘవాపూర్‌కు వెళ్తున్నారు. ఈ క్రమంలో ఘన్‌పూర్ నుంచి జనగామ వైపు వెళ్తున్న కారు మీదికొండ క్రాస్‌రోడ్డు వద్ద స్కూటీని వెనుకనుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు ఎగిరి రోడ్డుపై పడగా తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు 108 అంబులెన్స్ వారికి సమాచారం అందించగా తక్షణమే స్పందించి సంఘటనా స్థలానికి చేరుకున్న ఈఎంటీ హరికృష్ణ, పాయిలట్ రాజన్న వారిని 108 అంబులెన్స్‌లో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం వారి పరిస్థితి నిలకడగా ఉంది.

పోతన జయంతి

పాలకుర్తి: బమ్మెర పోతన జయంతి ఉత్సవాలను బీఆర్ఎస్ నాయకులు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోతన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గోపి, యాకయ్య, రాజు, నరేష్, సోమయ్య, గట్టయ్య పాల్గొన్నారు.

భూ ఆక్రమణలను అడ్డుకోవాలి

దేవరుప్పుల: ఏళ్లతరబడి సాగు చేసుకుంటున్న దళితుల భూములను ఆక్రమించే చర్యలను అధికార యంత్రాంగం అడ్డుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సింగారపు రమేశ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం మాధాపురంలో సర్వే నంబరు 18 లో గల దళితుల వ్యవసాయ భూములను ఓ భూస్వామి అక్రమిస్తున్న విషయమై చర్యలు తీసుకునేందుకు సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి ఆధ్వర్యంలో జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు.

తెలంగాణ ప్రజల విముక్తి కోసమే సాయుధ పోరాటం

జనగామ రూరల్/నర్మెట/పాలకుర్తి/జఫర్‌గఢ్/చిల్పూరు/బచ్చన్నపేట/రఘునాథపల్లి/లింగాలఘణపురం: నిజాం నిరంకుశ అరాచక పాలన నుంచి ప్రజల బానిస సంకెళ్ల విముక్తి కోసమే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం జరిగిందని సీపీఎం నాయకులు అన్నారు. పలు మండలాల్లో సోమవారం నాయకులు పార్టీ జెండాలను ఆవిష్కరించి ఈనెల 1నుంచి 17వ తేదీ వరకు నిర్వహించనున్న తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అలాగే లింగాలఘణపురం మండలంలోని నెల్లుట్లలో తెలంగాణ సాయుధ పోరాట అమరుడు పందిగోటి వెంకటయ్యకు నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అబ్బాస్, నాయకులు మోకు కనకారెడ్డి, జోగు ప్రకాష్ బూడిది గోపి,సుంచు విజయేందర్, ఎండీ షభానా, గుండెబోయిన రాజు, బొట్ల శేఖర్, ఇరుగు కృష్ణమూర్తి, సాదం రమేశ్, బెల్లంకొండ వెంకటేశ్, చుంచు విజయేందర్, మాచర్ల సారయ్య, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.


లింగాలఘణపురం: వెంకటయ్య స్తూపం వద్ద జెండా ఆవిష్కరిస్తున్న రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

చెస్ పోటీలు

జనగామ: గుడాల భూమయ్య జ్ఞాపకార్థం గుడాల ఫ్యామిలీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక సేజ్ హైస్కూల్‌లో చెస్ ఛాంపియన్స్ స్కూల్ లెవల్ పోటీలు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 9 టు అండర్ 14 విద్యార్థులకు చెస్ పోటీలు నిర్వహించారు. చియాన్, సూర్యతేజ, క్రిష్‌బాబు, ప్రవీణ్, రేణుకా, భాగ్యశ్రీ ఫైనల్స్‌కు అర్హత సాధించారు. గెలుపొందిన విద్యార్థులను స్కూల్ ప్రిన్సిపాల్ రోహన్ అభినందించారు. చెస్ పోటీలు నిర్వహించిన గుడాల ఫ్యామిలీ ఫౌండేషన్ చైర్మన్ గుడాల శ్రీను, కోచైర్మన్ వేణు, శ్రీధర్‌లను స్కూల్ యాజమాన్యం అభినందించారు. కార్యక్రమంలో కాసాల సంతోష్ కుమార్, రాజు తదితరులు పాల్గొన్నారు.


బహుమతులు గెలుపొందిన విద్యార్థులు

గణపయ్యకు ఘనంగా పూజలు


జనగామ: బాణాపురం అయ్యప్ప ఆలయంలో హోమంలో పాల్గొన్న భక్తులు


స్టేషన్‌ఘన్‌పూర్: పూజలో ఏసీపీ భీమ్‌శర్మ

సాక్షి నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా గణపతి నవరాత్రి ఉత్సవాలను భక్తులు ఘనంగా నిర్వహిస్తున్నారు. సోమవారం గణేశ్ మండపాల వద్ద నిర్వాహకులు అన్నదానం, మహిళలు కుంకుమార్చన, హోమం తదితర పూజలు నిర్వహించారు. పలు మండపాల వద్ద వినాయకుడికి ప్రముఖులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదం స్వీకరించారు. కాగా, జనగామ పట్టణంలోని 17వ వార్డులో కొలువుదీరిన గణనాథున్ని నిర్వాహకులు సోమవారం నిమజ్జనం చేశారు. అలాగే దేవరుప్పుల మండలంలోని కోలుకొండగ్రామ చౌరస్తాలో శ్రీవినాయక యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నవరాత్రులను పురస్కరించుకుని ఛత్రపతి శివాజీతో కూడిన గణేశ్ విగ్రహాన్ని స్థానికులు పూజించడం ప్రత్యేకతను సంతరించుకుంది.


చిల్పూరు: పూజల్లో పాల్గొన్న విరాట్ దంపతులు


జనగామ: గణేశ్ నిమజ్జన ఊరేగింపు..


జనగామ: గరిక పూజ చేస్తున్న భక్తులు


దేవరుప్పుల: శివాజీతో కూడిన గణేశ్ విగ్రహం

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం


నర్మెట: సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

నర్మెట: బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుబిల్లు అసెంబ్లీలో ఆమోదం పొందిన సందర్భంగా డీసీసీ ఉపాధ్యక్షుడు గంగం నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు మండల కేంద్రంలో సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. మండల అధ్యక్షుడు రాజబోయిన లక్ష్మీనారాయణ, జిల్లా కార్యదర్శి భూక్య జయరాం, యసల్ల అంజయ్య, బూస అంజయ్య, ప్రెజ్ఞాపురం శ్రీధర్, చెవుల పరశురాములు, వంగ భూపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లు చరిత్రాత్మకం

కొడకండ్ల: బీసీ వర్గాలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ల కల్పించాలనే మహోన్నత లక్ష్యంతో 2018 పంచాయతీరాజ్ చట్టం సెక్షన్ 285ఏను రద్దు చేస్తూ సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చరిత్రాత్మక నిర్ణయం తీసుకుందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ధరావత్ సురేష్‌నాయక్ అన్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ని హర్షిస్తూ మండలకేంద్రంలోని బస్టాండ్ సెంటర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీరెడ్డిల చిత్ర పటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు.

కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సామాజిక న్యాయం

దేవరుప్పుల: కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే జనాభా దామాషా ప్రకారం సామాజిక న్యాయం చేకూరుతుందని బీసీ సెల్ మండల అధ్యక్షుడు కాడబోయిన గణేశ్ అన్నారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు అసెంబ్లీలో బిల్లును ఏకగ్రీవంగా ఆమోదించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ సీఎం రేవంత్‌రెడ్డి ,ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి తదితరులు చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు.

పాలకుర్తి టౌన్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు చరిత్రాత్మకమని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గిరగాని కుమారస్వామిగౌడ్, మార్కెట్‌కమిటీ చైర్‌పర్సన్ లావుడ్యా మంజుల అన్నారు. మండల కేంద్రంలోని రాజీవ్ చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలభిషేకం నిర్వహించారు.

ట్రాన్స్‌ఫార్మర్ స్థల మార్పు



జనగామ: పట్టణంలోని చమన్ జంక్షన్‌లో ప్రమాదకరంగా మారిన ట్రాన్స్‌ఫార్మర్‌కు భద్రత కల్పిస్తూ సోమవారం విద్యుత్‌శాఖ అధికారులు పక్కకు మార్చారు. ఇటీవల సాక్షిలో ప్రమాదకరంగా మారిన ట్రాన్స్‌ఫార్మర్‌పై ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మాజీ కౌన్సిలర్ మారబోయిన పాండు ఆధ్వర్యంలో ట్రాన్స్‌ఫార్మర్‌ను మరోచోటకు మార్చడంతో కాలనీ వాసులు ఊపిరి పీల్చుకుని సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు.

‘ఉనికి కోసమే పాదయాత్ర’

స్టేషన్‌ఘన్‌పూర్: నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ ఉనికిని కాపాడుకోవడానికి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య పాదయాత్రలు నిర్వహిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జూలుకుంట్ల శిరీష్‌రెడ్డి అన్నారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీని, రాజయ్యను ప్రజలు మర్చిపోయారని, ఓట్ల ద్వారా ప్రజలు బుద్ధి చెప్పినా గుణపాఠం రాలేదన్నారు. సీహెచ్.నరేందర్ రెడ్డి, సారంగపాణి, యాదగిరి, రాజేష్‌నాయక్, విజయ్, శ్రీకాంత్, వసంత్ పాల్గొన్నారు.

మూడు కేంద్రాల ద్వారా యూరియా పంపిణీ

కొడకండ్ల: మండలకేంద్రంలోని మూడు విక్రయకేంద్రాల ద్వారా రైతులకు యూరియా పంపిణీ చేయుటకు ఏర్పాట్లు చేపడుతున్నట్లు మండల వ్యవసాయాధికారి విజయ్‌రెడ్డి తెలిపారు. ఆయా గ్రామాల రైతులు తమకు కేటాయించిన కేంద్రాల వద్ద టోకెన్లు పొంది యూరియాను తీసుకోవాలని ఆయన కోరారు.

‘కాళేశ్వరంపై కాంగ్రెస్ కుట్ర’

నర్మెట/తరిగొప్పుల/బచ్చన్నపేట: ప్రతిష్టాత్మకమైన కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం అసత్య ప్రచారాలతో కూడిన కుట్రలు చేస్తోందని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. రైతులకు సకాలంలో యూరియా అందించలేని రేవంత్ సర్కార్ అభివృద్ధి ప్రదాత కేసీఆర్‌పై విమర్శలు చేయడం హాస్యాస్పదమని అన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ కుట్రలను నిలదీస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పలు మండల కేంద్రాల్లో రాస్తారోకో నిర్వహించి నల్లజెండాలతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను అరెస్టు చేస్తే రాష్ట్రం అగ్నిగుండంగా మారుతుందని అన్నారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య, ఇర్రి రమణారెడ్డి, చింతకింది సురేష్, పింగిళి జగన్మోహన్‌రెడ్డి, పూర్ణచందర్, చంద్రారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య

నేడు జనగామకు ఎమ్మెల్యే ‘పల్లా’

జనగామ: ప్రమాదంలో గాయపడి హైదరాబాద్ స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటూ పూర్తిగా కోలుకున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మంగళవారం నియోజకవర్గంలో అడుగు పెట్టనున్నారు. మూడు నెలల సుదీర్ఘ కాలం తర్వాత నియోజకవర్గానికి విచ్చేస్తున్న ఎమ్మెల్యేకు భారీ స్వాగతం పలికేందుకు బీఆర్ఎస్ శ్రేణులు సన్నద్ధమవుతున్నాయి. బచ్చన్నపేట నుంచి మొదలుకుని జిల్లా కేంద్రం వరకు ఫ్లెక్సీలు, కటౌట్లతో స్వాగత తోరణాలను ఏర్పాటు చేశారు. ఉదయం 9.30 గంటలకు పోచన్నపేట మీదుగా బచ్చన్నపేట మండల కేంద్రానికి చేరుకుని, అక్కడ సభను ముగించుకుని జనగామకు బయలుదేరుతారు. 11 గంటలకు భారీ ర్యాలీగా బయలు దేరి ఆర్టీసీ చౌరస్తా వరకు చేరుకుంటారు. అనంతరం హైదరాబాద్ రోడ్డులోని మాంగళ్యఫంక్షన్ హాల్‌లో జరిగే ఆత్మీయ సమావేశానికి హాజరై కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగిస్తారు.


పట్టణంలో ఏర్పాటు చేసిన కటౌట్లు

విగ్రహాలు ఏర్పాటు చేయాలి

జనగామ రూరల్: జిల్లా కేంద్రంలో కొండా లక్ష్మణ్ బాపూజీ, నల్ల నర్సింహులు విగ్రహాలు ఏర్పాటు చేయాలి నర్సింహులు కుమార్తె చింతకింది అరుణ, పోపా గౌరవ అధ్యక్షుడు మచ్చ బాలనర్సయ్య కోరారు. ఈమేరకు సోమవారం పోపా ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

తహసీల్దార్‌కు వినతి

జఫర్‌గఢ్: నివాస స్థలాలను వ్యవసాయ భూమిగా మార్చి పట్టా చేసుకున్న వారి పేర్లను తొలగించాలని సాగరం గ్రామస్తులు కోరారు. ఈ మేరకు ఈ మేరకు తహసీల్దార్ రాజేశ్‌రెడ్డికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ సాగరంలోని 308 ఏ/ఈ సర్వేనంబర్‌లోని ఎకరం 21 గుంటలు, 308/డి/1/1లోని 30 గుంటల భూమిలో ఇళ్ల నిర్మించుకుని నివాసముంటున్న వారి స్థలాన్ని కొందరు అక్రమంగా వ్యవసాయ భూమిగా మార్చి పట్టాలు చేసుకోవడం జరిగిందన్నారు. అధికారులు స్పందించి అక్రమ పట్టాలను తక్షణమే రద్దు చేసి తమకు న్యాయం చేయాలని కోరారు.

బహుజనులు మేల్కోకుంటే భవిష్యత్ అంధకారమే

దేవరుప్పుల: పాలకవర్గాల్లోని అగ్రవర్ణాల నిరంతర కుట్రలను చేధిస్తూ బహుజనులు మేల్కోకుంటే భవిష్యత్ అంధకారమేనని బీఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి తాండ్ర అఖిల్ అన్నారు. సోమవారం సింగరాజుపల్లిలో మండల అధ్యక్షుడు ఎడవెల్లి రాము అధ్యక్షత నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మబ్బు ఉదయ్, చింత గణేష్, రాపాక శ్రీశైలం, మహాజనగళం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

జానపద నృత్య ప్రదర్శనలో విద్యార్థుల ప్రతిభ

చిల్పూరు: జిల్లా కేంద్రంలో సోమవారం కళా ఉత్సవ్-2025లో భాగంగా నిర్వహించిన జానపద నృత్య విభాగంలో పల్లగుట్ట ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు లాస్య, అర్పిత, నిహారిక, తేజశ్రీలు ద్వితీయ బహుమతి సాధించినట్లు హెచ్‌ఎం ఎల్లంభట్ల విజయ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా వారిని ఉపాధ్యాయులతో పాటు చిల్పూరు ఆలయ చైర్మన శ్రీధర్‌రావు, కార్యదర్శి బాపునాయక్, చిర్ర నాగరాజు, డాక్టర్ చిర్ర సుమన్, జీడి ఆనందం, బాసెట్టి జయప్రకాష్‌లు అభినందించారు.

శిల్ప కళలో శివసాయి..

దేవరుప్పుల: జిల్లా స్థాయి కళా ఉత్సవంలో శిల్పకళలో మాదాపురం హైస్కూల్‌కు చెందిన పదో తరగతి విద్యార్థి శ్రీమంతోజు శివసాయి అత్యుత్తమ ప్రతిభ కనబర్చి మొదటి బహుమతి పొందినట్టు హెచ్‌ఎం రమేశ్ తెలిపారు. ఈ సందర్భంగా శివసాయిని ఎంఈఓ కళావతి అభినందించారు.

సంక్షిప్త సమాచారం

సోలిపూర్‌కు బస్సు సౌకర్యం కల్పించాలి

తరిగొప్పుల: సోలిపూర్ గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని బీజేవైఎం మండల ఉపాధ్యక్షుడు చిలువేరు వెంకటేశ్ కోరారు. ఈ మేరకు సోమవారం జనగామ డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్ మాట్లాడుతూ గ్రామానికి బస్సు సౌకర్యం లేక వివిధ రకాల పనుల మీద జిల్లా, మండల కేంద్రానికి వెళ్లాలంటే మహిళలు, వృద్ధులు, విద్యార్థుల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ విషయమై డిపో మేనేజర్‌కు వినతిపత్రం ఇవ్వడం జరిగిందన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలో కాంగ్రెస్ సత్తా చాటాలి

తరిగొప్పుల: కాంగ్రెస్ ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వగలబోయిన యాదగిరి అన్నారు. మండలకేంద్రంలో గ్రామశాఖ అధ్యక్షుడు పండుగ కనుకయ్య అధ్యక్షతన సోమవారం ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఇందిరమ్మ ఇండ్లు, ఉచిత బస్సు, ఉచిత విద్యుత్, పంట రుణమాఫీ పై ప్రజలకు వివరించాలన్నారు.


రాజ్యాంగ హక్కులను కాలరాయొద్దు

తరిగొప్పుల: ప్రజాప్రతినిధులు అసెంబ్లీ సాక్షిగా రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాయాలని చూడటం సరికాదని గిరిజన నాయకుడు భూక్య జానునాయక్ అన్నారు. లంబాడీ, బంజారా, సుగాలి వర్గాలపై కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సోయం బాబురావు, తెల్లం వెంకట్రావు చేస్తున్న దుష్ప్రచారాన్ని సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశం తీవ్రంగా ఖండించారు. వెంటనే వారిని పార్టీ నుంచి బహిష్కరించాలని డిమాండ్ చేశారు.

విద్యార్థులు సత్ప్రవర్తన కలిగి ఉండాలి

బచ్చన్నపేట: విద్యార్థి దశ నుంచే సత్ప్రవర్తన కలిగుండాలని, అప్పుడే జీవితంలో రాణిస్తారని కేసిరెడ్డిపల్లి సెకండరీ పాఠశాల హెచ్‌ఎం సుధాకర్ అన్నారు. సోమవారం పాఠశాలలో విద్యార్థులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు.

కాంగ్రెస్ జెండా ఎగరాలి



రఘునాథపల్లి: వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామ గ్రామాన కాంగ్రెస్ జెండా ఎగరాలని,, నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పని చేయాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు లింగాల జగదీష్‌చందర్ రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఏఎస్ఆర్ గార్డెన్‌లో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోళ్ల రవిగౌడ్ అధ్యక్షతన జరిగిన మండల పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో వారు మాట్లాడారు.

అథ్లెటిక్స్‌లో విద్యార్థిని ప్రతిభ

జనగామ రూరల్: పెంబర్తిలోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థిని జరుపుల జ్యోతి రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ కనబరిచి కాంస్య పథకాన్ని సాధించి సత్తా చాటింది. గత నెల 30, 31వ తేదీల్లో పాలమూరు యూనివర్సిటీ మహబూబ్‌నగర్ జిల్లాలో జరిగిన 11వ రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్ ఛాంపియన్ షిప్‌లో వంద మీటర్ల పరుగు పందెంలో పాల్గొని నాల్గవ స్థానం, లాంగ్ జంప్‌లో మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని సాధించింది. ఈ సందర్భంగా సోమవారం కళాశాల ఫిజికల్ డైరెక్టర్ శిరీషను పతకం సాధించిన జ్యోతిని ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి, అధ్యాపకులు అభినందించారు.

పాలకుర్తిలోనే ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటు చేయాలి

పాలకుర్తి టౌన్: నియోజవకర్గ కేంద్రంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటు చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు మారం రవికుమార్,మండల ప్రధాన కార్యదర్శి పెనుగొండ సోమేశ్వర్ కోరారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.

రూం టు రీడ్

నర్మెట: ప్రభుత్వం నూతనంగా అమలు చేస్తున్న రూం టు రీడ్ కార్యక్రమం విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందని హెచ్‌ఎం పగిడిపల్లి దామోదర్ అన్నారు. ఈ సందర్భంగా మాన్‌సింగ్‌తండా పీఎస్‌లో సోమవారం అరగంట కార్యక్రమం నిర్వహించారు. ఈ నెల 15వ తేదీ వరకు ప్రతి రోజు రీడింగ్ క్యాంపేనింగ్ నిర్వహిస్తామని అన్నారు. ఉపాధ్యాయుల, విద్యార్థులు పాల్గొన్నారు.

‘స్థానికం’లో గెలుపే లక్ష్యంగా ముందుకుసాగాలి

కొడకండ్ల: త్వరలో జరుగే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు కల్సి గట్టుగా ముందుకు సాగి మండలంలో సత్తా చాటాలని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ధరావత్ సురేష్‌నాయక్ కోరారు. సోమవారం రామవరం గ్రామంలో క్లస్టర్ ఇన్‌చార్జ్ రాజేష్‌నాయక్ అధ్యక్షతన నిర్వహించిన ఎంపీటీసీ క్లస్టర్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు.

తిరుమలలో బానాజీపేట అధ్యాత్మిక మహిళా బృందం

రఘునాథపలి: తిరుమలలో కొనసాగుతున్న అఖండ హరినామ సంకీర్తనలో బానాజీపేట శ్రీ సీతారామాంజనేయ అధ్యాత్మిక మహిళా భజన మండలి సంకీర్తన చేసే అవకాశాన్ని అందిపుచ్చుకుంది. అక్కడ బృందం సభ్యులు రెండు రోజులపాటు అధ్యాత్మిక భజనలు చేసి సోమవారం భక్తులు, ఆలయ అర్చకులచే ప్రశంసలు పొందారు. బృందం అధ్యక్షుడు గైని శోభ, బృందం సభ్యులు ఉన్నారు.